ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 12 పుష్పం : 36-38 5-6-2001

RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 12
VOL : 6 ISSUE : 12
EDITOR
P.S. RAMA RAJU
EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : Rs. 140/-
Each Copy : Rs. 10/-

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278

## సాధన

అది చీకటి రాత్రి. కొంతమంది కలసి నర్సాపురం నుంచి అంతర్వేదికి పడవమీద గోదావరిలో వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. కడుపునిండా తిని, సారా అధిక మొత్తంలో తీసుకొని, పడవలో కూర్చొని, తెడ్లు వెయ్యటం మొదలుపెట్టారు. అరుపులు, కేకలతో మనం అంతర్వేదికి వచ్చేస్తున్నాం, వచ్చేస్తున్నాం అని అనుకుంటున్నారు. తెడ్లు మట్టుకి చాలా బలంగా వేస్తున్నారు. సుష్టుగా తిన్నమూలాన, తాగినమూలాన, తెడ్లువేసి శ్రమపడ్డమూలాన, వారందరికి నిద్రకమ్మి, సుఖంగా పడుకొన్నారు. ఇంతట్లో తెల్లవారింది. లేచి చూచేటప్పటికి, వారు ఎక్కడబయలుదేరారో, ఆ నర్సాపురం గోదావరి గట్టువద్దే ఉన్నారు. ఎక్కడ లోపం జరిగింది, మనం ఇంత కష్టపడి రాత్రంతా తెడ్లువేసి ప్రయాణము చేసినా మనం ఎక్కడ బయలుదేరామో, అక్కడే ఉన్నాము. ఒక్కఅంగుళం కూడా కదలలేదు అని బాధపడి, దానికి కారణం గురించి, విచారణ మొదలుపెట్టారు. తీరా చూస్తే, చిన్న తప్పవల్ల అలా జరిగింది. అది ఏమిటంటే, పడవ తాడుతో ఒడ్డున ఉన్న ఒకస్తంభానికి కట్టివేయబడిఉన్నది. దాని ముడి విప్పటం వీరు తాగిన మైకంలో మరిచారు.

అట్లే మన జీవితనావ, సంసారమనే నదిలో ఉండి మనసనే తాడుతో దేహం అనే స్తంభానికి ముడివేయబడిఉన్నది. మనముకూడా అజ్ఞానాంధకారంలో, విషయాకర్షణ మత్తులో ఉండి, అహంభావం అనే చిజ్జడ గ్రంధిని విచారణ చేయకుండా, "నేను దేహమును" అనే తాదాత్మ్యాన్ని ఏమాత్రం శోధించకుండా ఎన్ని సాధనలు చేసినప్పటికీ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక్కఅడుగుకూడా ముందుకు వెయ్యలేము. అహంభావాన్ని జాగ్రత్తగా అట్టేపెట్టుకొని చేసే సాధనలన్నీ నిరర్ధకము. అందుచేత నిజవిచారణతోనే సాధన మొదలౌతుంది. లేకపోతే ఎక్కడవేసిన గొంగళి అక్కడే.

ఈ సంచికలో..............

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

23-01-2001 ఆకివీడు .............................. 2
08-02-2001 కేశవరం .............................. 6
04-04-2001 చింతపల్లి .............................. 9

# హృదయంలో ఉన్న బ్రహ్మము స్ఫురించక పోవటానికి కారణం మనలో దోషములే

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-1-2001, ఆకివీడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

బ్రహ్మం మన హృదయంలో ఉంది, అదే అంతటా వ్యాపించి ఉంది. బ్రహ్మమే సత్యము. సర్వకాల సర్వావస్థలలో ఈ సృష్టిఉన్నా లేకపోయినా, శరీరాలుఉన్నా లేకపోయినా ఎప్పుడూ చెదరకుండా, కదలకుండా తనంతట తానుగా ఉండేది సత్యం. మనం మాట్లాడుకొనే మాటలు వ్యవహారిక సత్యములు. సత్యం అంటే బ్రహ్మమే. దేవతలకు, అవతార పురుషులకు, జ్ఞానులకు, ఈ సృష్టికంతాకూడా శక్తినిచ్చేది అదే. దాని అనుగ్రహం వలననే మనకు శక్తి కలుగుతుంది. మనం ఎన్ని ప్రవచనాలు శ్రవణం చేసినా, ఎన్ని నదులలో మునిగినా, ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా సత్యం మన హృదయంలోనే ఉంది అనే నిశ్చయం ఈనాటికి కూడా మనకు కలగటం లేదు. ఇది మాయయొక్క ప్రభావము. బ్రహ్మం మన హృదయంలోనే ఉంది అనేది శాస్త్రవాక్యం, మహర్షివాక్యం. అది నూటికి నూరుపాళ్ళు సత్యం. మనకు తెలిసినా, తెలియకపోయినా బ్రహ్మం మన హృదయంలోనే ఉంది. కాని అది మనకు గోచరమవ్వటం లేదు. దానికి మనలోఉన్న దోషములు, బలహీనతలు కారణం. మనలో ఉన్న బలహీనతలు మనలను ఎంతదూరం తీసుకొనివెళ్ళాయి అంటే హృదయంలోఉన్న బ్రహ్మం మనకు తెలియకపోయినా ఫరవాలేదు మన హృదయంలోనే బ్రహ్మం ఉంది అనే గుర్తిపుకూడా రాకుండా చేస్తున్నాయి. అంటే జీవుడు ఎంత పతనమయ్యాడో చూడండి. జీవుడిలోఉన్న దోషాలు వాడి మనస్సును బాహ్యముఖం చేస్తున్నాయి, లోపల బ్రహ్మం ఉంది అనే గుర్తింపు జీవుడికి రావటంలేదు. రజోగుణం ఉన్నవారు, తమోగుణం ఉన్నవారు ఎంతసేపు ఏదో బరువుమోస్తూ ఉంటారు. వారికి ధనంఉన్నా లేకపోయినా, చదువుఉన్నా లేకపోయినా మనస్సుతో ఏదో కల్పించుకొని ఆ బరువు మోస్తూ ఉంటారు. చనిపోయే వరకు వారికి బరువు మోయటమే పని. మనం సత్వగుణాన్ని ఆశ్రయించాలి. సత్వగుణాన్ని ఆశ్రయించినవాడికి సత్యాన్వేషణ చేయాలనే బుద్ధి కలుగుతుంది.

జ్ఞానధనాన్ని సంపాదించుకో మిగిలినవన్నీ స్వప్న సమానము అని భగవాన్ చెపుతూఉంటే ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. ఎవరైనా తిండిలేకుండా బాధపడుతున్నారు అనుకోండి వారికి సహాయం చెయ్యాలి కదా, అంతేగాని ఇది అంతా స్వప్న సమానము అనుకొని ఏమీ చేయకుండా ఉండటం న్యాయమా అన్నారు. అప్పుడు భగవాన్ ప్లీడరుగారితో నేను చెప్పేది అదికాదు, సరిగా అర్థం చేసుకో. వాడికి అన్నంపెట్టవద్దు అని నేను చెప్పటం లేదు. నీకు నిజం తెలిసినప్పుడు వాడు ఆకలితో బాధపడటం, నీవు వాడికి అన్నం పెట్టటం ఇవి రెండూకూడా స్వప్నం అని నీకు తెలుస్తుంది అంతేగాని ఆకలితో బాధపడేవాడికి అన్నంపెట్టవద్దు అని నేను చెప్పటం లేదు. దేహం ప్రారబ్దమును బట్టి నడుస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. దేహంతోఉన్న తాదాప్యం వదిలించుకోవటానికి ప్రయత్నం

చేస్తూ ఉంటే లోపలున్న సత్యం తళుక్కున మెరుస్తుంది. పూర్వజన్మలో సత్కర్మ చేసిఉంటేగాని, పూర్వజన్మ పుణ్యఫలం ఉంటేగాని నీకు లోచూపు కలుగదు. నీకు లోచూపు కలుగుతూఉంటే శాస్త్రముతో నీకు పనిఏముంది అన్నారు మహర్షి. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గోచరింపచేసుకోవటమే ప్రపంచంలోఉన్న అన్ని మతముల సారము. సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకొంటే నీవు స్వేచ్ఛను పొందుతావు, సంసారచక్రంలోనుండి విడుదల పొందుతావు. ఒక కులానికి, ఒక మతానికి పరిమితమైన మనిషికి ఆధ్యాత్మిక పురోగతి రాదు. లోపలున్న సత్యం ఎవరిని అనుగ్రహిస్తే అది వారికి తెలియబడుతుందిగాని అడిగినవారికి అందరికి అది తెలియబడదు. ప్రతీ మనిషి నేను బుద్ధిమంతుడను అనుకొంటాడు. నువ్వు అనుకొంటే సరిపోదు లోపలున్న సత్యం నీవు బుద్ధిమంతుడివి అని అనుకోవాలి. నేను మంచివాడిని అనుకొనేవాడు ఎవడూ మంచివాడు కాదు. ఎందుచేతనంటే నిజమైన మంచివాడికి వాడిలో మంచితనం ఉన్నట్లుకూడా వాడికి తెలియదు, నేను మంచివాడిని అని వాడు అనుకోడు.

కొంతమంది జరిగిపోయిన గొడవలు అన్నీ తలపెట్టుకొని కాలాన్ని పాడుచేసుకొంటారు. కొంతమంది వారికి ఇప్పుడు కష్టం లేకపోయినా ఏదో కష్టం వస్తుంది అని ఊహించుకొంటూ కాలాన్ని పాడుచేసుకొంటారు. సాధకుడికి అదీ పనికిరాదు, ఇదీ పనికిరాదు. చేతిలోఉన్న కాలాన్ని ఉపయోగించుకోవాలి. నీ హృదయంలోఉన్న బ్రహ్మం తప్పించి అన్నీ నీ మనస్సుయొక్క కల్పితములే. నీ హృదయంలోఉన్న బ్రహ్మం సత్యాలకు సత్యం Reality of Realities. దేవుళ్ళు అందరూ సత్యం అనుకొంటున్నారు ఆ దేవుళ్ళందరికి ఆధారంగా ఉన్నది నీ హృదయంలో ఉన్న బ్రహ్మమే. దానికి బంధం లేదు. దానితో నీకు తాదాప్యంవస్తే నీవుకూడా బంధంలేని స్థితికి వెళతావు. సూర్యుడికి వెలుతురును ఇచ్చే శక్తి ఇచ్చేది బ్రహ్మమే. సూర్యుడు చీకటిని చూడలేడు. కాని నీలోపల ఉన్న బ్రహ్మం చీకటినికూడా చూడగలదు. దేనివలన గాలి వీస్తోందో, దేనివలన సూర్యుడు వెలుతురును ఇస్తున్నాడో, దేనివలన చంద్రుడు చల్లదనాన్ని ఇస్తున్నాడో వాడిని పట్టుకో, ఆ శక్తిని పట్టుకో. వాడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావేమో వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. బ్రహ్మం అనుభవంలోనికి వచ్చినప్పుడు దానిని ఎంజాయ్ చేయటానికి నేను ఉండాలికదా అంటారు కొంతమంది. ద్వైత సిద్ధాంతం ఇక్కడే ఉంది. జీవుడు ఉండాలి కదా ఎంజాయ్ చేయటానికి, జీవుడు లేకపోతే ఎవడు ఎంజాయ్ చేస్తాడు అని వారి ఉద్దేశం. బాహ్యంగా ఎంజాయ్ చేయటానికి అలవాటుపడిపోయి ఇటువంటి సందేహాలు వస్తాయి. బ్రహ్మానుభవం కలిగినప్పుడు దానిని అదే ఎంజాయ్ చేస్తూ ఉంటుంది అక్కడ జీవుడితో పనిలేదు. ద్వైతాన్ని అతిక్రమించాలంటే పూర్వజన్మల పుణ్యబలం ఉంటేగాని అది సాధ్యంకాదు. నీవు వేలాది జన్మలలో సత్కర్మ చేసిఉంటేగాని అద్వైతస్థితి నీ చేతికి అందదు. ద్వైతం గురించి, అద్వైతం గురించి భగవాన్ చాలా అందంగా చెప్పారు. నీవు కానిదానితో తాదాప్యం పొందితే అది ద్వైతం, నీవు ఏదైతే అవునో దానితో తాదాప్యం పొందితే అది అద్వైతం. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొనేవాడు జీవుడు. ఎందుచేతనంటే వాడు

దేహానికి పరిమితమై ఉన్నాడు. అటువంటి పరిమితులు నీ హృదయంలో ఉన్న సత్యానికి లేవు. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి. అది దొరికేవరకూ సుఖంకోసం, శాంతికోసం, ఆనందంకోసం బజారులో వెతుక్కొంటూనే ఉంటావు. నిజమైన సుఖం నీ హృదయంలోనే ఉంది. బజారులో నీవు ఏదైనా సుఖాన్ని అనుభవించినా రెట్టింపు దుఃఖం దాని వెనకాలే నీకు వచ్చేస్తుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండాలి.

బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది. నీకు ఎఱుకపడటానికి సదా సిద్ధంగా ఉంది. తోసివెయ్యండి, తోసి వెయ్యండి జన్మజన్మలనుండి మోసుకొని వస్తున్న వాసనలను, సంస్కారములను తోసివెయ్యండి. అప్పుడు హృదయంలోఉన్న వస్తువు తళుక్కున మెరుస్తుంది. వాసనలు బరువైన దుంగలలాగ ఉంటాయి. కేవలము నీ ప్రయత్నమువలన వాటిని గెంటలేవు. గురువు అనుగ్రహం లేకపోతే వాటిని మీరు కదపలేరు. మీరు ప్రయత్నం చేయండి ఎప్పడో గురువు అనుగ్రహం వస్తుంది, వాటిని బయటకు గెంటివేస్తుంది. అయితే గురువు అనుగ్రహానికి పాత్రులయ్యే పనిచెయ్యండి. నీకు కనిపించి వెళ్ళిపోయే దేవుడు కావాలా, 24 గంటలు నీకూడా ఉండే దేవుడు కావాలా అనేవారు భగవాన్. నీ శరీరంఉన్నా లేకపోయినా, ఈ లోకం కనిపించినా కనపించకపోయినా, నీ బంధువులు, స్నేహితులు నిన్ను విడిచివెళ్ళిపోయినా ఎప్పడూ సర్వకాల సర్వావస్థలలో నీకూడా ఉండేది బ్రహ్మమే. అది ఎప్పడూ నిన్ను విడిచిపెట్టదు. విడిచిపెట్టటం ఏమిటి అది నీవై ఉన్నావు. దానికంటే నీవు వేరుగాలేవు. నేను దానికంటే వేరుగా ఉన్నాను అనే భావన, అనే తలంపు విడిచిపెట్టటమే నీ సాధనయొక్క లక్ష్యం. నీ లోపలున్న సత్యవస్తువుకు దేహంతో అణుమాత్రంకూడా సంబంధం లేదు. సత్యవస్తువు తాలుక ఎఱుక జీవం, అదే అమృతస్థితిని కలుగజేస్తుంది. దాని తాలుక మరుపు మరణం రెండూ చెపుతున్నారు, బలవంతం చేయటం లేదు. దేనిని పట్టుకొంటావో నీవే నిర్ణయించుకో.

ప్రపంచంలో ఏ రంగంలో అయినా ఒక మేధావిని తీసుకొని నీవు ఎవరో నీకు తెలుసా అని అడగండి. వాడు తలకాయ వంచుకోవలసిందే. వాడు ఎవడో వాడికి తెలియదు. ఈ విద్యలు అన్నీకూడా మన పొట్ట ఎంత నిజమో అవికూడా అంతే నిజం. విద్యలన్నింటికి రాజు ఆత్మవిద్య అని భగవంతుడు గీతలో చెప్పాడు. ఏ విద్యను నేర్చుకోవటం వలన నీవు ఎవరో నీకు తెలుస్తుందో అదే ఆత్మవిద్య. నీ హృదయంలోఉన్న వస్తువును ప్రత్యక్షముగా నీ చేతికి పట్టి ఇచ్చేదే నిజమైన విద్య. అదే ఆత్మవిద్య. బ్రహ్మంను తెలుసుకోవటం అంటే బ్రహ్మంగా ఉండటమే. ఆ బ్రహ్మం ఎవరు ? మీరు గుడికివెళ్ళి ఏ దేవుడిని ఆరాధిస్తున్నారో ఆ దేవుడికి దేవుడు. దేవుళ్ళందరికి దేవుడు అయిన వాడిని మీ హృదయంలో పెట్టుకొని గుడులచుట్టూ, గోపురాలుచుట్టూ, నదులచుట్టూ తిరుగుచున్నారు. మనం ఏదైతే కాదో దానిని రోజూ జ్ఞాపకం పెట్టుకొంటున్నాము. వివేకాన్ని పెంచుకోవటం మానివేసి అవివేకాన్ని పెంచుకొంటున్నాము, జ్ఞానాన్ని పెంచుకోవటం మానివేసి అజ్ఞానాన్ని పెంచుకొంటున్నాము. ఏదైతే అవునో దానిని పూర్తిగా మర్చిపోతున్నాము. దానికి సంబంధించిన ఎఱుక మనకు లేదు. నీవుకాని దానిని

విడిచిపెడితేగాని నీవు ఎవరో నీకు తెలియదు. కాని దానితో నీకు ఉన్నతాదాప్యాన్ని వైరాగ్యంఅనే గొడ్డలితో నరికితేగాని ఆ తాదాప్యం పోదు. నీవు గృహస్థు ధర్మంలో ఉన్నప్పడు నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి. అంతవరకే. మనందరము ఒకరోజు పుట్టలేదు, అందరం ఒకరోజు చనిపోము. భగవంతుడు మనకు ఇచ్చిన పనిని నిర్మలంగా చేసుకొని వెళ్ళిపోవాలి. నీవు ఏదైతే కాదో దానిని నీవు జ్ఞాపకం పెట్టుకొన్నా అది అవ్వవు. నీవు ఏదైతే అవునో దానిని సదా జ్ఞాపకం పెట్టుకోవటం వలన అది నీవు కాబట్టి అది అవుతావు. నీవు కానిదానితో తాదాప్యం పొందుతున్నంత కాలం నీకు చీకటిలోకాలు తప్పవు. విషయజ్ఞానం అంతా సాపేక్షిక జ్ఞానం. అది స్వతంత్రమైనది కాదు. ఈ విషయాలను సేకరించే మనస్సు ఎంత నిజమో అదికూడా అంతే నిజం. ఏదైతే ఉందో దానిని పట్టిఇచ్చేది ఆత్మజ్ఞానం.

దేహం స్మశానానికి వెళ్ళేలోపు అనేక చేదు అనుభవాలు, అనేక తియ్యటి అనుభవాలు రావచ్చు. వస్తే రానియ్యి. ప్రారబ్దంలో ఉన్నప్పడు నీవు వద్దాన్నా ఆగవు. చేదు అనుభవాలను, తీపి అనుభవాలను రాకుండా నీవు ఆపలేవు, వాటిచేతికి దొరకకుండా చేసుకోగలవు. ఈ అనుభవాలు అన్నీ దేహంతో తాదాప్యం పొందే నేనుకే. ఆ దేహంతో తాదాప్యం తెగిపోయింది అనుకో చేదుఅనుభవాలు వచ్చినా, తీపిఅనుభవాలు వచ్చినా నీకు ఏమీ అనిపించదు, నీకు హెచ్చుతగ్గులు రావు. ప్రపంచంలో సుఖాలు, దుఃఖాలు అన్నీ నీకు వచ్చినా నీకు దేహంతో తాదాప్యం లేకపోతే అవి నిన్ను ఏమీ చెయ్యలేవు. అగ్నిహోత్రుడిలో ఉన్న కాల్చేశక్తిని బ్రహ్మం తీసేసుకొంటే అగ్నిహోత్రుడు వలన ఏమీ అవ్వదు. అలాగే దేహంతో ఉన్న తాదాప్యం నీకు పోతే ప్రపంచంలో ఉన్న కష్టాలు అన్నీ నీకు వచ్చినా వాటివలన నీకు ఏమీ నష్టం లేదు, వాటివలన నీ మనస్సుకు ఆందోళన రాదు. ప్రపంచంలో ఉన్న కష్టాలు అన్నీ నీకు వస్తే రానియ్యి. అందులో ఏమీలేదు అది అంతా Dust. ఆ కష్టానికి నీవు ప్రాణం పోస్తున్నావు కాబట్టి కష్టం క్రింద నీకు అనిపిస్తోంది. నీకు దేహబుద్ధిలేనప్పడు ఎన్నికష్టాలు వచ్చినా నీకు ఏమీ అనిపించదు, నీవు గంభీరంగా ఉంటావు, లోతుగా ఉంటావు. నీకు ఏదో జ్ఞాపకాలు కావాలి. నీ మనస్సుకు ఏదో సపోర్టు కావాలి. అందుచేత అనాత్మ విషయాలను జ్ఞాపకం పెట్టుకొనేబదులు చైతన్యానికి, ఆత్మకు సంబంధించిన జ్ఞాపకాలతో జీవించు. నీ మనస్సుతో అరుణాచలాన్ని పట్టుకో. నీ చేతులతో పని చేసుకో. నీవు ఏ పనిచేస్తున్నా నీ లోపలఉన్న అరుణాచలానికి సంబంధించిన ఎరుక విడిచిపెట్టవద్దు. అజాగ్రత్త పనికిరాదు. నిరంతరం భగవంతుని జ్ఞాపకం పెట్టుకోవటం వలన నీవు యోగివి అవుతావు. భగవంతుడు నీకు ఆత్మగా వ్యక్తమవుతాడు. జ్ఞాపకమే చాలు. భగవంతుని జ్ఞాపకం మర్చిపోతే అనాత్మ విషయాలు వచ్చేస్తాయి. అక్కడనుండి బంధం ప్రారంభమవుతుంది. దైవధ్యానం విడిచిపెట్టకు, గురుస్మరణ విడిచిపెట్టకు. అశ్రద్ధ పనికిరాదు, సోమరితనం పనికిరాదు.

## మనంకానిదానిని మనంఅని అనుకొంటున్న మూలాన, హృదయగుహలోనికి ప్రవేశించలేకపోతున్నాము

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-2-2001, కేశవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరం మరణించటం వలన ఎవరికి జ్ఞానం రాదు. శరీరం మరణించటానికి మనం ఏమీ సాధన చేయనక్కరలేదు, ఏదో ఒకరోజు మరణిస్తుంది. శరీరం మరణించకముందే ఎవడి మనస్సు అయితే మరణించిందో వాడికి హృదయంలో ఉన్న సత్యం తెలుస్తుంది. అహంభావన లేకుండా మనిషి ఉండడు. అహంభావన ఉంటే మనిషి, అహంభావనపోతే మహర్షి. మనం అహంభావనను తొలగించుకోవాలి. మనం పూజచేసినా, యజ్ఞంచేసినా, ఏ సాధనచేసినా మనం తొలగించుకోవలసింది ఏమిటి అనే దానిని మర్చిపోకూడదు. ఇప్పడు మనం కేశవరం వచ్చాము. బంధువుల ఇంటికి వెళ్ళవచ్చు, స్నేహితుల ఇంటికి వెళ్ళవచ్చు కాని ఇక్కడకు వచ్చిన పని మర్చిపోకూడదు. మనం ఇక్కడకు సత్సంగసమావేశానికి వచ్చాము అది మర్చిపోకూడదు. అలాగే మనం ఈ లోకంలోనికి వచ్చిన పని ఏమిటి? ఏది సాధించాలి అనేది మర్చిపోకూడదు. దేహప్రారబ్దంలో ధనం, చదువు, యశస్సు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి కాని మనం ఈ లోకంలోనికి వచ్చిన పని మర్చిపోకూడదు. నీవు ఎక్కడున్నా అహంభావనను తొలగించుకోకపోతే జననమరణచక్రంలోనుండి బయటకు రాలేవు. అన్ని మతముల సారము ఒక్కటే. కాని ఒకమతానికి ఇంకోమతానికి, ఒకమనిషికి ఇంకోమనిషికి మధ్య పేచీలు ఎందుకు వస్తున్నాయి అంటే ఈ పేచీలు సృష్టించేది స్వార్ధపరులు. స్వార్ధం ఉన్నవాడికి పరమార్ధం అందదు.

మనం ఏ పనిచేసినా యాంత్రికంగా చేయకూడదు, అశ్రద్ద పనికిరాదు. ఈశ్వరానుగ్రహం పొందటానికి తగిన అర్హత, యోగ్యత సంపాదించే మాటలు మాట్లాడాలి. ఈశ్వరానుగ్రహం పొందటానికి అనుకూలమైన పనులు చేయాలి. అప్పడు వర్షం కురిసినప్పడు భూమి ఎలా తడుస్తుందో అలాగ భగవంతుడు ఆయన అనుగ్రహంతో మనలను తడుపుతాడు. మీకు యోగ్యత, అర్హత ఉన్నా మీకు ఉన్నట్లు కొంతమంది అంగీకరించరు దీనికి అసూయ కారణం అందుచేత మీరు అసూయ వంక చూడకూడదు. పెద్దలు సదాచారంగా బ్రతకమని చెపుతారు అంటే చెడు చూడవలసివచ్చినప్పడు గుడ్డివాడిగా బ్రతుకు, చెడు మాట్లాడవలసివచ్చినప్పడు మూగవాడిగా బ్రతుకు, ఎవరైనా ఇతరుల గురించి చెడు చెప్పేటప్పడు చెవిటివాడుగా బ్రతుకు. ఇలా సదాచారంగా బ్రతికితే ఇంద్రియాలు అణుగుతాయి, మనస్సు అణుగుతుంది, నీకు అంతర్‌దృష్టి కలుగుతుంది. అంతర్‌దృష్టి కలిగితేనేగాని

ఆత్మానుభవం పొందలేము. కుండలో అన్నం ఉన్నా పైన మూకిడి ఉంటే లోపల ఉన్న అన్నం కనబడదు. అలాగే మన హృదయంలో అమృతత్వం ఉంది కాని పైన మూకిడిలాగ అహంభావన ఉంది. దానిని తీయాలంటే తీయలేకపోతున్నాము ఎందుచేతనంటే ఆ మూకిడి మనకు బంగారంలాగ కనిపిస్తోంది అందువలన దానిని మనం బయటకు గెంటలేకపోతున్నాము అని ఒక ఉపనిషత్‌లో చెప్పాడు. నేను మీ అందరిని హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను అనుకోండి, ప్రేమించటంలో నాకు స్వార్థం లేదు అనుకోండి, మీ అందరిపట్ల నాకు ఆప్యాయత ఉంది అనుకోండి, అది కపటంకాదు అనుకోండి నేను పెద్ద సాధనలు చేయనక్కరలేదు నా మనస్సు అణిగిపోతుంది, హృదయగుహలో పడిపోతుంది. మనం కొన్ని చిట్కాలు నేర్చుకోవాలి. మనం ఎన్ని పూజలు, జపాలు చేసినా ఆడంబరంగా జీవిస్తే ఏమి ప్రయోజనం లేదు, అహంభావన పెరిగిపోతుంది. మనం పూజలు చేయకపోయినా ఆడంబరం లేకుండా జీవిస్తే అహంభావన తగ్గిపోతుంది. నీ హృదయంలో సత్యవస్తువు ఉంది. కాని దేహాభిమానం వలన, జీవలక్షణాల వలన వస్తువులోపల ఎంత ప్రత్యక్షముగా ఉన్నప్పటికి, ఉన్నట్లు మనకు అవగాహన కావటంలేదు. గురువు ఆ వస్తువును తెచ్చిఇవ్వడు. అది నీ హృదయంలోనే ఉంది. ఏ దేహాభిమానం వలన, జీవలక్షణాల వలన ఆ వస్తువు నీకు వ్యక్తం కావటం లేదో ఆ గుణాలను తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు వాడు గురువు.

నీ హృదయంలో ఉన్న వస్తువు చాలా సింపుల్‌గా ఉంది. కాని అది కాంప్లికేటెడ్‌గా ఉంది అని నీవు ఊహించుకొంటున్నావు. నీ ఊహే లోపలున్న వస్తువు నీకు తెలియకుండా అడ్డువస్తోంది. ఎవరో ఇతరులు అడ్డువస్తున్నారని నీవు అనుకొంటున్నావు. ఇలా ఎన్నో జన్మలు వ్యర్థమవుతున్నాయి. మన బుద్ధి నిజంకానిదానిని నిజం అని నమ్ముతుంది, ఆందోళనకు గురిఅవుతుంది. దానిని వదిలివేస్తుంది. మరల ఇంకో అనిజాన్ని పట్టుకొంటుంది. మరల దానిని వదిలేస్తుంది. ఎప్పుడు చూసినా అశాంతి, ఆందోళన, పోరాటం. ఇలా ఎన్నో జన్మలు జరిగిపోతాయి. ఎప్పుడో గురువుఅనుగ్రహం వలన బుద్ధికి దానిమూలమైన సత్యం తెలిసినప్పుడు అది అణుగుతుంది, దాని గూటిలో అది పడిపోతుంది. పంచదార ఉంది అనుకోండి చీమలను మీరురండి, మీరురండి అని పంచదార పిలవనక్కరలేదు. వాటి అంతట అవే పంచదార దగ్గరకు వచ్చేస్తాయి. అలాగే ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో వాడి దగ్గరకు జీవకోటి అంతా ఆకర్షించబడుతుంది. వాడు సమాజం మధ్యలోఉన్నా, గుహలోఉన్నా ఆ ఉపాధిద్వారా ఎవరైతే తరించబడవలసిఉందో వారు అంతా ఆకర్షితులవుతారు. ఆయన సన్నిధిలో నీ లోపల అవ్యక్తంగాఉన్న వస్తువు నీకు గోచరమవుతుంది. కృష్ణుడు L.K.G.వారికి, U.K.G.వారికి కూడా పనికి వచ్చేవిధంగా చెపుతాడు. నాకు పుష్పాన్నిఇయ్యి, పండునుఇయ్యి లేకపోతే

నీరుఇయ్యి అని చెపుతాడు. కాని భగవాన్ ఏమంటారు అంటే ఇది త్యాగమా? అహంభావనను విడిచిపెట్టటమే త్యాగం అని చెపుతారు. కాని కృష్ణుడు అలా ఎందుకు చెపుతున్నాడు అంటే మనలను ప్రిపేర్ చేయటానికి పండుఇయ్యి, పుష్పంఇయ్యి అంటే నెమ్మదిగా ఆ ఎత్తుకు తీసుకొని వెళ్ళటానికి కృష్ణుడు చేసిన ప్రయత్నం ఇది, అంటే త్యాగబుద్ధిని నేర్పటంకోసం చేసిన ప్రయత్నం. త్యాగబుద్ధి ఎందుకంటే మనం కానిదానిని విడిచిపెట్టటం కోసం. ప్రతీజన్మలోకూడా పూజలు, జపాలు, ఏవో సాధనలు చేస్తూనే ఉంటాము. కాని మనస్సులో మనం కానిదానిని మనం అని అనుకొంటూనే ఉంటాము. అందువలన హృదయగుహలోనికి ప్రవేశించలేకపోతున్నాము, కనీసం ఆ సమీపంలోనికికూడా వెళ్ళలేకపోతున్నాము.

గురువు ఏమి చేస్తాడు అంటే మనకు ఇష్టమైన వారిచేత తిట్టిస్తాడు ఎందుచేతనంటే వారిని హృదయంలో మోస్తూ ఉంటాము. హృదయంలో ఎవరిని మోస్తున్నారో గురువుకు తెలుసు. ఆ మోత తగ్గించటం కోసం వారిచేత తిట్టిస్తాడు. ఆ నాలుగు మొట్టికాయలు పడితేగాని ఆ మోత ఆగదు. నీ లోపల ఏముందో నీకు తెలియదుగాని గురువుకు తెలుస్తూఉంటుంది. ఎందుచేతనంటే నీలోపల అంతర్యామిగా ఉన్నాడు. బ్రహ్మానుభవం కలగటానికి ఏ సంస్కారములయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించటానికి నిరంతరం, నిర్విరామంగా గురువు కృషిచేస్తూనే ఉంటాడు. అవసరమైతే నీకోసం శరీరం ధరించివస్తాడు, నీ లోపలనుండి గైడెన్స్ ఇస్తూఉంటాడు. ఆ గైడెన్స్ నీకు అర్ధంకానప్పుడు బాహ్యంగా ఒక శరీరం ధరించి నీకు టీచ్‌చేయటం కోసం వస్తాడు. వాడు గురువు. ఇవిఅన్నీ మీకు అందకపోయినా గురువును ఒక పెద్దచుట్టం అని అనుకోండి. నీవు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని నదులలో మునిగినా గురువు అనుగ్రహానికి అవి సాటికావు. ఎన్ని రచనలుచేసినా, ఎన్ని ప్రవచనాలుచేసినా గురువుయొక్క మౌనంలోఉన్న శక్తిని, గురువుయొక్క మాటలోఉన్న శక్తిని వర్ణించలేరు. గురువు చేసే పని మనం గ్రహించాలి అనుకొన్నా అది నీకు అందదు. అది నీకు అందటంలేదు కాబట్టి గురువు పనిచేయటంలేదు అని నీకు అనిపిస్తుంది. లోపలున్న వస్తువు మాటకు అందదు, మనస్సుకు అందదు. ఎక్కడైతే మాట అణిగిందో, మనస్సు అణిగిందో అక్కడ అది వ్యక్తమవుతుంది. ప్రపంచం లేనేలేదు. నీ అహంభావనే ప్రపంచంక్రింద కనిపిస్తోంది. అహంభావన అణగకుండా ప్రపంచం అణగదు. ఎవడికైతే అహంభావనపోయిందో ఈ లోకంఅంతాకూడా వాడి హృదయంలో ఐక్యమయిపోతుంది.

# నీవు కానిది నీవు అని అనుకున్నంతకాలం, నిజం తెలియబడదు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 4-4-2001, చింతపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం భౌతికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా సామాన్యమైన తెలివితేటలు సరిపోతాయి. మన ప్రవర్తనలో బాధ్యత ఉండాలి. మనం బాధ్యతగా ప్రవర్తిస్తూ ఉంటే ధర్మంయందు గౌరవం పెరుగుతుంది, ధర్మం ఆచరించాలి అనే నిర్ణయం కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించటం వలన మనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది. బ్రహ్మం నీ హృదయంలోనే ఉంది. బ్రహ్మం నీకు అనుభవంలోనికి రాకుండా నీ అజ్ఞానమే నీకు అడ్డు వస్తోంది. అజ్ఞానము పోవటానికి నీ జీవితంలో సంఘటనలు క్రియేట్‌చేసి, అజ్ఞానము పోగొట్టుకోవటానికి నీకు శక్తిని ఇచ్చి, నీకు సహాయసహకారములు అందించేవాడే గురువు. మనం పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా ఏ సాధన చేసిన దానివలన మనస్సుకు అంతర్‌దృష్టి కలగాలి ఎందుచేతనంటే వస్తువు లోపలేఉంది, బయట ఏమీలేదు. నీ హృదయంలో ఉన్న బ్రహ్మం తప్పించి అన్నీ మనోకల్పితములు మాత్రమే. మనం ఏదిచేసినా వ్యక్తిభావనతో చేయకూడదు, సమిష్టిదృష్టిని అలవర్చుకోవాలి. మనం ఎంతసేపు నేను, నేను అని వాడుతూ ఉంటాము అలా కాకుండా మనం మనం అనుకోవటం వలన మనస్సుకు విశాలదృష్టి కలుగుతుంది. మన మనస్సు ఇరుకు అవ్వటం వలన లోపలఉన్న వస్తువు తెలియటం లేదు. మన మనస్సు విశాలమయితే, మన మనస్సు పల్చబడితే, మనస్సు నిర్మలమయితే లోపల ఉన్న వస్తువు మనకు తెలుస్తూ ఉంటుంది. మనం ఎక్కడ జన్మించాలి, ఎక్కడ మరణించాలి, మరణించేలోపు ఈ శరీరంద్వారా ఏమి జరగాలి అనేది ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది. ఇది మనకు అర్థమయితే వ్యక్తిభావన తగ్గిపోతుంది.

భగవదనుభవం పొందటానికి నాలుగు విషయాలు ముఖ్యం, భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని మనకు పూర్తిగా నమ్మకం కలగాలి. అది నోటితో చెప్పటంకాదు మనస్సుకు విశ్వాసం కుదరాలి. ఉన్నాడు అనుకొంటే సరిపోతుందా వాడి మీద మనకు ప్రేమ కలగాలి, ప్రీతి కలగాలి. ప్రీతి కలిగితే సరిపోతుందా సరిపోదు పరమేశ్వరుని తెలుసుకోవాలనే బుద్ధి కలగాలి. ఆయనను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. తరువాత అదిగా మీరు ఉండగలగాలి అంటే పరమేశ్వరుడు ఎలా ఉన్నాడో అలా మనం ఉండగలగాలి. ఈ నాలుగు అంచెల వలన మనకు జ్ఞానం కలుగుతుంది. అప్పుడు ఆత్మశాంతి మన చేతికి అందుతుంది. డబ్బుపోతే తిరిగి సంపాదించుకోవచ్చును గాని జరిగిపోయిన కాలం తిరిగిరాదు. అందువలన కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. కాలాన్ని పాడుచేసుకొంటే భగవంతుడిని

అగౌరవపరచినట్లు అవుతుంది. చాలామంది ఉపయోగంలేని మాటలు చెప్పకొంటూ కాలక్షేపం చేసేస్తారు. మీరు ఎవరితో ఇలా కాలక్షేపం చేస్తున్నారో వారు ఎవరూ మీ దేహం చనిపోయిన తరువాత మీకూడా రారు. ఇలా కాలాన్ని పాడుచేసుకోవద్దు. నీవు ఆత్మవుకాని నీకు దేహబుద్ధి వస్తోంది. నీకు దేనివలన ఈ దేహబుద్ధి వస్తోందో దానిని విడిచిపెట్టటం వలన నీకు జ్ఞానం కలుగుతుంది గాని బాహ్యంగా ఏదో విడిచిపెట్టటం వలన జ్ఞానం రాదు.

భగవంతుడికి శరణాగతి చెందు. ఆయన సంకల్పంతో రాజీపడు. ఎప్పడైనా కష్టాలు వస్తూ ఉంటాయి, కంగారు పడవద్దు. అవి భగవంతుడికి తెలిసే వస్తున్నాయి. అందువలన ఆయన సంకల్పంతో రాజీపడటం నేర్చుకోండి. అదికూడా సాధనే. నీవు బాధ్యతాయుతంగా జీవించటం వలన, సూక్ష్మబుద్ధిని పెంచుకోవటం వలన ఈశ్వరుడియొక్క శక్తి ఇటువంటిది కదా అని నీకు తెలుస్తూ ఉంటుంది. ఈ శరీరం శవం అవ్వకముందే వ్యక్తిభావనలోనుండి ఎవడైతే విడుదల పొందాడో వాడు శరీరం ఉండగానే బ్రహ్మంలో ఐక్యమవుతాడు. నీ కోరికకు శక్తి లేదు. ప్రారబ్ధంలో ఉంటే నీ కోరికతో నిమిత్తం లేకుండా అది జరిగిపోతుంది. నీ ప్రారబ్ధంలో లేకపోతే నీవు కోరుకొన్నా అదిరాదు. ఇది నీకు అర్థమయితే నీ మనస్సు చల్లబడిపోతుంది. మీరు ఏకాంతంగా కూర్చోండి. మీకు ఏ తలంపు వచ్చినా అది ఎందుకు వస్తోంది అని చూస్తే దానికి దేహమే కేంద్రం అవుతుంది. దేహం కేంద్రంగా పెట్టుకొని వచ్చే తలంపులు అన్నీపోతే అతని ప్రేమ విశ్వవ్యాప్తం అవుతుంది. అంటే నీ వ్యక్తిగతమైన వాంఛలు పోయినప్పడు నీ ప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. వ్యక్తి భావన లేకుండా, అహంభావన రహితంగా జీవించేవాడికి రసహృదయం కలుగుతుంది. అప్పడు వాడి ప్రేమ హద్దులు లేకుండా ఒక కులంతోటి, మతంతోటి, జాతితోటి సంబంధం లేకుండా ప్రపంచం అంతా ప్రసరిస్తుంది.

మనకు అనేక తలంపులు వస్తూఉంటాయి. మనకు ఏ తలంపు వచ్చినా ఆ తలంపు వచ్చినందుకు ఈశ్వరుడికి సమాధానం చెప్పాలి. ఆయనకంటే మనం వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి మనకు వచ్చే ప్రతీ తలంపుకు ఆయనకు సమాధానం చెప్పాలి. కాయ బాగా ముగ్గి పండుఅయిన తరువాత చెట్టునుండి సహజంగా ఎలా వేరుపడిపోతుందో అలాగ నీవు చేసే పనిద్వారా, బాధ్యతాయుతమైన జీవితంద్వారా సహజంగా దేహబుద్ధినుండి విడిపోయి జన్మలేని స్థితిని పొందాలి. మీరు ఇంటిదగ్గర ఉండి మీ దైనందిన కార్యక్రమాలు చేసుకొంటూ సాధన చేసుకోండి. ఏదో కోపం తెచ్చుకొని ఇల్లు విడిచిపెట్టి పారిపోవద్దు. కోపం తెచ్చుకొని పారిపోవటం వలన జ్ఞానంరాదు. ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో వెళ్ళటం వలన మీకు ఇంటిలో ఉన్న సదుపాయాలుకూడా అక్కడ ఉండవు. ఇంటిదగ్గర ఉండి సాధన చేసుకొన్నా మీరు తరిస్తారు. అయితే ఎప్పడైనా అరుణాచలంవెళ్ళినా, కాశీవెళ్ళినా,

రామేశ్వరంవెళ్ళినా ఎంతోకొంత శక్తిని సంపాదించుకోవటానికే ఎందుచేతనంటే ఇంతకుముందు ఎంతోమంది మహర్షులు, మహాత్ములు తిరిగిన పుణ్యప్రదేశాలు అవి. ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికోపారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. ఇక్కడేఉండి నీ స్వభావాన్ని మార్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మన స్వభావాన్ని మార్చుకోవటం చాలా కష్టం. స్వభావాన్ని మార్చుకోవటానికి నిజంగా ప్రయత్నం చేస్తూఉంటే నీకు అనేక కష్టాలు, బాధలు ఎదురవుతాయి. నిప్పుమీద చెయ్యివేస్తే నీకు ఎంత బాధ కలుగుతుందో స్వభావాన్ని మార్చుకొనే ప్రయత్నంలో నీకు అంత బాధ కలుగుతుంది. వీటిని అన్నింటిని తట్టుకొని నీవు ప్రయత్నం చేయాలి. ఆత్మానుభవం పొందటానికి నీకు ఏవైతే అవరోధాలు ఉన్నాయో చూసుకో. నీవు ఎక్కడికో పారిపోవటంవలన ఈ అవరోధాలు పోవు. ఈ అవరోధాలను తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేయాలి. పోగొట్టుకోవలసినది ఏదో దానిమీదే నీ సాధనను గురిపెట్టు. ఇతరుల గొడవ నీకు వద్దు. ఇతరులను అనుకరించవద్దు. నీవు బాగుపడే విధానం చూసుకో. నీ లోపలున్న పరమేశ్వరుడు నీకు అనుభవంలోనికి వస్తే ఈ లోకానికి నీద్వారా ఎంతో మేలు జరుగుతుంది. నిన్ను చూసి ఎంతోమంది మారుమనస్సు పొందుతారు. భక్తి ఏ వయస్సులో వచ్చినా అప్పుడు ప్రారంభించి దానిని బలపర్చుకోవాలి. ఇప్పుడు వచ్చింది ఏమిటి, ఈ వయస్సులో ఇంక ఏమిచేయగలము అని అనుకోకూడదు. ఇప్పుడు చేయగలిగింది చేస్తే మరుజన్మలో అది కంటిన్యూ అవుతుంది.

నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అని అనుకోవద్దు. చేసింది పరమేశ్వరుడే, నీ వల్ల ఏమిఅవుతుంది. నీ దేహాన్ని ఉపయోగించుకొన్నాడు అంతే చేసింది ఆయనే, కర్త ఆయనే. నేను చేసాను, నేను చేసాను అని అనుకొంటే కర్తకు దూరమైపోతావు అంటే పరమేశ్వరుడికి దూరమైపోతావు. ధ్యానంచేసి, జపంచేసి, విచారణచేసి ఏ స్థితిని పొందుతారో నీవు కర్మ చేస్తూకూడా ఆ స్థితిని పొందవచ్చు అయితే నీవు కర్తలేని కర్మనుచెయ్యాలి. నేను చెడ్డవాడిని, నేను చెడ్డవాడిని అని అనుకోవద్దు. నీలో ఎంతోకొంత మంచితనం ఉంది కదా దానిని అభివృద్ధి చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. పాజిటివ్ తింకింగ్ అలవాటు చేసుకో.

నీకు దుఃఖం రావటానికి కారణం, అశాంతి రావటానికి కారణం దేహమే నీవు అనుకొంటున్నావు, ఇంద్రియాలే నీవు అనుకొంటున్నావు, ఇంద్రియాలకు గోచరమయ్యే విషయాలే నీవు అనుకొంటున్నావు అందువలన నీకు అశాంతి వస్తోంది. నీవుకానిది నీవు అనుకొన్నంత కాలం ఏది అవునో అది నీకు తెలియబడదు. లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఏ ఆకర్షణకు గురిఅయినా మనస్వరూపానికి దూరమవుతాము. భక్తి విషయంలో

మనంకూడా చిన్నపిల్లలమే. చిన్నపిల్లలను వస్తువు ఏదైనా తెమ్మని పంపిస్తే మధ్యలో ఏవైనా ఆటలు కనబడితే అవిచూస్తూ మనం చెప్పిన పని మర్చిపోతారు. మనంకూడా అలాగే ఉన్నాము. లోకంలో ఉన్న ఆకర్షణలకు గురిఅయి ఈ భూమిమీదకు ఎందుకువచ్చావో మర్చిపోతున్నాము. అందుకే వచ్చిన పని చూసుకోండి అని భగవాన్ తరచుగా చెప్పేవారు. మీ శరీరాలు ఉపవాసం చేస్తున్నా మనస్సు ఉపవాసం చేస్తోంది అని అనుకోవద్దు. ఉపవాసం చేసిన రోజున అన్నం గొడవ ఎక్కువగా ఉంటుంది అంటే మనస్సు ఉపవాసం చేయటం లేదు అని అర్ధం. మనం బాగుచేసుకోవలసింది మనస్సును. దేనినైతే బాగుచేసుకోవాలో దానిని వదిలివేస్తున్నాము. ఇంక మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది. నీ మనస్సును బాగుచేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎవరో వచ్చి బాగుచేస్తారని ఎదురుచూడకు. మనస్సును బాగుచేసుకొంటే మోక్షం. మనస్సును బాగుచేసుకోకపోతే బంధం. రెండూ నీ చేతులలో ఉంది. ఏది చేయాలో నిర్ణయించుకో.

బయట ఉన్న సంపద మనకూడా రాదు. లోపల ఉన్న సంపద మనకూడా వస్తుంది. అందువలన లోపల ఉన్న సంపదను అంటే ఆధ్యాత్మిక సంపదను పెంచుకొంటూ రావాలి. నీ స్వభావాన్ని మార్చుకోవటానికి నీవు ప్రయత్నం చేసినా అందులో సక్సెస్ అవుతావు అని చెప్పలేము అలాగని ప్రయత్నం మానవద్దు, నీవు చేయగలిగిన ప్రయత్నం చెయ్యి. నీ స్వభావం మారేకొలది నీ ఆధ్యాత్మిక అంతస్థు పెరుగుతుంది. అప్పుడు నీ మాటలో స్వచ్ఛత ఉంటుంది, నీ మాటకు పవిత్రతకు వస్తుంది, నీ మాటకు శక్తి వస్తుంది. డబ్బు సంపాదించటానికి ఎంతో దూరం ప్రయాణం చేస్తున్నావు, విదేశాలకు వెళ్తున్నావు. అలాగే ఒక సహృదయుం ఉన్నవాడిని కలుసుకోవటానికి అవసరమైతే భూమియొక్క అంచులవరకు ప్రయాణం చెయ్యి. అయితే నీకు డబ్బుమీద ఉన్న ప్రీతి సహృదయుంమీద లేదు అందుకే ప్రయాణం చెయ్యటం లేదు. నీవు ప్రయత్నం ప్రారంభించు. కంగారు పడవద్దు. నెమ్మదిగా అభివృద్ధిలోనికి వస్తావు. నీవు చేసిన ప్రయత్నం వృధాపోదు. కొబ్బరికాయను కొడతాము. అది నాలుగోసారి కొట్టినప్పుడు పగిలింది అనుకోండి మనం ఏమి అనుకొంటాము అంటే నాలుగో దెబ్బ తగిలినప్పుడు కాయ పగిలింది అనుకొంటాము అది అబద్దం మిగిలిన మూడు దెబ్బల ప్రభావం దానిమీద ఉంది నాలుగో దెబ్బకు పగిలింది అంతే. అలాగే నీవు చేసిన ప్రతీ ప్రయత్నంయొక్క ప్రభావం ఉంటుంది. మీ సాధనా ఫలంగా మీకు జ్ఞానం కలుగుతుంది. మీరు హైద్రాబాద్ వెళుతున్నారు అనుకోండి హైద్రాబాద్ వెళ్లే ట్రైనులో కూర్చొంటేచాలు అదే మిమ్మల్ని గమ్యానికి చేరుస్తుంది. అలాగే ముందు నీవు సాధనను ప్రారంభించు. ప్రారంభిస్తే అదే నిన్ను గమ్యానికి తీసుకొని వెళుతుంది.

మనం సహజంగా జీవించాలి. కృత్రిమ జీవనమునకు అలవాటు పడకూడదు. కృత్రిమంగా జీవించేవాడు ఇతరుల లోపములను వెతుకుతూ ఉంటాడు. దానివలన చిత్తశాంతికి దూరమవుతాడు, చిత్తక్షోభకు గురిఅవుతాడు. నిజం సహజంగానే ఉంటుంది. సహజంగా జీవించేవాడికి అది తెలియకపడుతుంది.